నమస్తే తెలంగాణ
జిందగీ



# ఓ ఆట ఆడించింది..

ఓటీటీ హిట్



**స్క్విడ్ గేమ్:** 2
**నెట్‌ఫ్లిక్స్:** డిసెంబర్ 26
**తారాగణం:** లీ జంగ్ జే, వై హా జూన్, లీ బైంగ్ హున్ తదితరులు
**దర్శకత్వం:** హ్వాంగ్ డాంగ్ హ్యుక్

'కొరియన్' చిత్రసీమ విభిన్నమైనది. ఇక్కడినుంచి వచ్చే సినిమాలు, వెబ్‌సిరీస్‌లలో ప్రత్యేకశైలి కనిపిస్తుంది. కొన్నేళ్ల కింద వచ్చిన 'పారసైట్' చిత్రం.. నాలుగు ఆస్కార్ అవార్డులను కొల్లగొట్టి సరికొత్త చరిత్ర సృష్టించింది. మూడేళ్ల కింద రిలీజైన 'స్క్విడ్ గేమ్' వెబ్‌సిరీస్ కూడా.. ప్రపంచవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేసింది. క్షణక్షణానికీ ఉత్కంఠ రేపుతూ సాగిన ఆ సిరీస్‌కు.. సీక్వెల్‌గా వచ్చిందే స్క్విడ్ గేమ్: 2. క్రైమ్, సర్వైవల్ ఎలిమెంట్స్‌తో కూడిన చిన్నపిల్లల ఆటల నేపథ్యంతో 'స్క్విడ్ గేమ్' సాగుతుంది. భారీగా అప్పుల పాలై.. జీవితం మీదే ఆశలు కోల్పోయిన కొందరిని ఓ రహస్య దీవిలోకి చేర్చి.. పిల్లల ఆటల పేరుతో ప్రమాదకరమైన గేమ్స్ ఆడిస్తుంటారు కొందరు. ఆయా ఆటల్లో ఓడిన వారి ప్రాణాలు తీసి వినోదం చూస్తుంటారు. అవి మామూలు ఆటలే అనుకుని ఆడటం మొదలుపెట్టిన 456 మందిలో అందరూ చనిపోతారు. చివరికి సియాంగ్ జీ హున్ (లీ జంగ్ జే) 'స్క్విడ్ గేమ్'లో అన్ని దశలనూ పూర్తి చేసి.. దాదాపు రూ.265 కోట్ల ప్రైజ్ మనీ గెలుచుకుంటాడు. కానీ, ఆ ఆట అతనిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మనుషుల్నే పావులుగా వాడుతూ.. ప్రమాదకరమైన ఆటలు ఆడిస్తున్న వ్యక్తిని కనిపెట్టి, ఈ డేంజర్ గేమ్‌ను ఆపి తీరాలని నిర్ణయించుకుంటాడు. తాను గెలుచుకున్న డబ్బుతోనే.. ఆ వైపుగా ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏంటి? వందల కోట్లు గెలుచుకున్న సియాంగ్.. మళ్లీ 'స్క్విడ్ గేమ్'లోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? మరోసారి అతను బతికి బయటపడ్డాడా? ప్రమాదకర గేమ్స్ ఆడిస్తున్న నిర్వాహకులకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? తెలియాలంటే.. 'స్క్విడ్ గేమ్ : 2'ను చూడాల్సిందే!

తొందరపాటు చేటుకు దారితీస్తుంది.
ఆలస్యం అమృతాన్ని విషం చేస్తుంది.
నిత్య జీవితానికే కాదు.. సినిమాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది.
ఎందుకంటే.. కాలజాలాన్ని అంచనా వేయకుండా చేసిన కొన్ని ప్రయోగాలు ఈ విషయాన్ని చాలాసార్లు రుజువు చేశాయి. కొన్ని సినిమాలు దశాబ్దం ముందుగానే తెరమీదికొచ్చి బోర్లా పడితే, మరికొన్ని చిత్రాలు ఓ పదేండ్లు ఆలస్యంగా వచ్చి చతికిలపడ్డాయి. ఆయా చిత్రాలు సరైన సమయంలో విడుదలై ఉంటే... బాక్సాఫీస్ రికార్డులు తిరగరాసేవే! కానీ, టైమింగ్ మిస్ కావడం వల్ల.. అప్పటికైతే బోరింగ్ సబ్జెక్టులుగా మిగిలిపోయాయి.

# టైమింగే కింగ్



సమకాలీన చిత్రాలను చిత్రిక పట్టడంలో దర్శకుడు బాపు గొప్ప నేర్పరి. ఆయన సినిమాలు తిలక్ కవితల్లా వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలంత హాయిగా ఉంటాయి. 1967లో 'సాక్షి' సినిమాతో బాపు దర్శకుడిగా వెండితెరకు పరిచయం అయ్యారు. ఆ సినిమా మెరుపు విజయం సాధించింది. అప్పుడే బాపు-రమణ ద్వయం ఓ ప్రయోగానికి పూనుకుంది. అదే 'బంగారు పిచుక'. 1968లో విడుదలైన ఈ సినిమా కొత్త సబ్జెక్టు. అప్పటివరకు కనీవినీ ఎరుగని కథ. కథనం కూడా హాలీవుడ్ సినిమాలా గమ్మత్తుగా సాగుతుంది. తల్లి అదుపాజ్ఞల్లో ఉన్న ఓ సుకుమారుడు ఇంటి నుంచి బయటికి వచ్చేస్తాడు. అతనికో అందమైన ఆడపిల్ల తారసపడుతుంది. కోటీశ్వరుడైన ఆ రాకుమారుణ్ని కొందరు దుండగులు ఫాలో అవుతుంటారు. రకరకాల మలుపులు తిరుగుతూ.. సాగుతుంది. ఆ సినిమా తీసినవాళ్లకు నచ్చింది. చూసినవాళ్లకు మాత్రం అంతగా అర్థం కాలేదు. ఫలితం.. మరీ బలహీనంగా కలెక్షన్లు వచ్చాయి. ఈ సినిమాలో చంద్రమోహన్, విజయలలిత జంటగా నటించారు. ఏండ్లు గడిచాయి. బాపు కుంచె నుంచి అపురూప చలన చిత్ర రాజాలు వెండితెరకు వన్నెలు అద్దాయి. 'బంగారు పిచుక' వచ్చిన 26 ఏండ్లకు అచ్చంగా అదేకథతో 'పెళ్లికొడుకు' సినిమా తీశారు బాపు. ఇందులో హీరోగా నరేశ్, హీరోయిన్‌గా దివ్యవాణి నటించారు. ఇదీ ఫ్లాప్‌టాక్ మూటగట్టుకుంది. 'ఒకే సబ్జెక్టుతో తీసిన ఈ రెండు సినిమాలు ఎందుకు పరాజయం పాలయ్యాయి?' అని బాపును ఎవరో అడిగితే, ఆయన తనదైన శైలిలో 'ఒకటి టూ ఎర్లీ.. ఇంకోటి టూ లేట్' అని నవ్వుతూ సమాధానమిచ్చారట. అదన్నమాట టైమింగ్ మహిమ!

❖ ❖ ❖

ఎన్టీఆర్ హీరోగా, షావుకారు జానకి హీరోయిన్‌గా, వై.ఆర్.స్వామి దర్శకత్వంలో వచ్చిన సినిమా 'వద్దంటే డబ్బు'. 1954లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో ప్రయోగాత్మకమనే చెప్పుకోవాలి. ఆంగ్ల నవల 'బ్రూస్టర్స్ మిలియన్స్' ఆధారంగా కథను సిద్ధం చేసుకున్నారు. ఇందులో లక్షాధికారి వారసురాలిని హీరో ప్రేమిస్తాడు. తన కూతురినిచ్చి పెండ్లి చేయాలంటే నెల రోజుల్లో లక్ష రూపాయలు ఖర్చు చేయాలని ఆమె తండ్రి షరతు పెడతాడు. సంపాదించడం కష్టం కానీ, ఖర్చు చేయడం తేలికే కదా అనుకుంటాడు హీరో. కానీ, దిగితే గానీ లోతు తెలియదన్నట్టు.. డబ్బులు ఖర్చు చేసే క్రమంలో అంతకంతకూ వచ్చి పడే సొమ్ముతో సొమ్మసిల్లిపోతాడు హీరో! కథ ఎలాగూ సుఖాంతమే అయ్యిందనుకోండి.. సినిమా ఫలితమే నిర్మాతకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత 1985లో దాదాపు ఇదే కథతో దర్శకుడు జంధ్యాల 'బాబాయ్ అబ్బాయ్' సినిమా తీశారు. ఇందులో బాలకృష్ణ, సుత్తి వీరభద్రరావు అబ్బాయి, బాబాయ్‌లుగా నటించారు. కథానాయిక అనితారెడ్డి. ఈ చిత్రంలోనూ కోట్లకు వారసురాలైన తన కూతురిని మనువాడాలంటే నెల రోజుల్లో రూ.25 లక్షలు ఖర్చు చేయాలని కథానాయిక తండ్రి షరతు పెడతాడు. వాటిని ఖర్చు చేయలేక నానా అగచాట్లూ పడతారు బాబాయ్, అబ్బాయ్. చివరికి డబ్బు జబ్బులకు హేతువనీ, ప్రేమే సత్యమని చాటిచెబుతుందీ చిత్రం. ఈ చిత్రంలో జంధ్యాల మార్కు కామెడీ విశేషంగా ఉన్నా.. సినిమా ఫలితం మాత్రం ఆశించినట్టు రాలేదు. టైమింగ్ మిస్సవ్వడం వల్లే... ఈ రెండూ పరాజయం పాలయ్యాయని సినీ విశ్లేషకులు తీర్మానించారు. ఈ తరహా కండిషన్‌తోనే రూపుదిద్దుకున్న సినిమా 'అరుణాచలం'. 1997లో విడుదలైన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. కథా వస్తువులో చిన్నపాటి మార్పు, కథా గమనంలో ట్విస్టులు, రజినీకాంత్ స్టయిల్ వెరసి 'అరుణాచలం' సినిమాను అందలం ఎక్కించాయి.



"సుకుమార్ డైరెక్షన్‌లో మహేశ్‌బాబు హీరోగా వచ్చిన '1- నేనొక్కడినే' కూడా ఇలా టైమింగ్ మిస్సయిన సినిమానే! మైండ్‌లో కెమికల్ ఇన్‌బ్యాలెన్స్ ఉన్న హీరో.. జరిగినవి జరగనట్టుగా, జరగనివి జరిగినట్టుగా ఊహించేసుకుంటాడు. ఈ క్రమంలో సినిమా స్క్రీన్‌ప్లే కాస్త గందరగోళంగా సాగుతుంది. పదేండ్ల కిందట విడుదలైన '1' టూ ఎర్లీగా వచ్చిన సబ్జెక్ట్ అనే చెప్పాలి. ఈ రోజుల్లో ఇంకా క్లారిటీతో తీసి ఉంటే.. బ్లాక్‌బస్టర్‌గా నిలిచేది."

### ప్రేమ శాశ్వతం కాదు..

యాక్షన్ సినిమా అయినా, ఫ్యామిలీ చిత్రమైనా.. కథలో కీలకం హీరోహీరోయిన్ల ప్రేమ. అలాంటి ప్రేమ నిత్యనూతనంగా ఉండాలని సగటు ప్రేక్షకుడు అభిలషిస్తాడు. లవ్ సీన్లు ఎంత చిక్కగా పండితే.. సినిమా అంత చక్కగా హిట్ అవుతుంది. కానీ, ఆ ప్రేమనే ప్రశ్నిస్తూ, ప్రేమ శాశ్వతం కాదని, ప్రేమించిన వ్యక్తిని జీవితకాలం అదే రేంజ్‌లో లవ్ చేయడం కుదరదనే కాన్సెప్ట్‌తో వచ్చిన సినిమా 'ఆరెంజ్'. మగధీర విజయంతో మంచి ఊపుమీదున్న రామ్‌చరణ్ ఇందులో హీరో. హహ్హా హాసినీ అంటూ 'బొమ్మరిల్లు'తో హిట్టుకొట్టిన జెనీలియా హీరోయిన్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకుడు. 2010లో వచ్చిన ఈ సినిమా సంచలన విజయం సాధిస్తుందని భావించారంతా! భారీ బడ్జెట్‌తో ఆస్ట్రేలియాలోనే సింహభాగం షూటింగ్ చేశారు. అయితే, ఈ డిఫరెంట్ లవ్ కాన్సెప్ట్ అప్పటి ప్రేక్షకులకు అస్సలు రుచించలేదు. మిలీనియల్స్‌కే మింగుడుపడలేదు. తర్వాతికాలంలో ఈ సినిమా టీవీ ప్రేక్షకులను మాత్రం అలరించింది. ఇదే సినిమా 2020 తర్వాత విడుదలై ఉంటే.. భారీ హిట్టు కొట్టేదని విశ్లేషకుల మాట. టైమింగ్ మిస్సవ్వడం చిత్ర నిర్మాత నాగబాబును కోలుకోలేని విధంగా దెబ్బతీసింది.

### ఇదో రకం టైమింగ్

ప్రయోగాత్మక సినిమాలకు పెట్టిందిపేరు హీరో కృష్ణ. ఆయన వందో సినిమా 'అల్లూరి సీతారామరాజు' అప్పట్లో సంచలన విజయం సాధించింది. ఈ సినిమా ప్రివ్యూ చూసిన నిర్మాత చక్రపాణి.. కృష్ణతో 'ఇప్పుడు నీతో ఎంతమంది నిర్మాతలు సినిమాలు తీస్తున్నారు?' అని ప్రశ్నించాడట. దానికి కృష్ణ ఓ ఐదారుగురు నిర్మాతల సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయన్నారట. 'వాళ్లంతా మునిగిపోవడం ఖాయం' అన్నారట చక్రపాణి. 'అల్లూరి సీతారామరాజుగా నిన్ను చూసిన ప్రేక్షకులు ఇప్పట్లో మరో పాత్రలో నిన్ను ఊహించుకోలేరు' అని జోస్యం కూడా చెప్పారట. ఆయన అన్నట్టుగానే.. 'అల్లూరి..' తర్వాత కృష్ణను వరుస ఫ్లాప్‌లు పలకరించాయి. అలా టైమింగ్ మిస్సయ్యిందన్నమాట.

**మెగాస్టార్** చిరంజీవి కూడా ఈ టైమ్ బాంబ్ బారినుంచి తప్పించుకోలేకపోయారు. చిరంజీవి బ్లాక్‌బస్టర్స్ 'గ్యాంగ్‌లీడర్', 'రౌడీ అల్లుడు', 'ఘరానామొగుడు' హిట్ల తర్వాత వచ్చిన.. 'ఆపద్బాంధవుడు' కళాఖండం అనిపించుకున్నా.. వసూళ్లను రాబట్టలేకపోయింది. మళ్లీ 'ముఠామేస్త్రి' హిట్ ఎఫెక్ట్ తర్వాత వచ్చిన నాలుగైదు సినిమాలపై పడింది. ఆ తర్వాత వచ్చిన 'మెకానిక్ అల్లుడు' చిరు, ఏయన్నార్ కలిసి కామెడీ చేసినా పరాజయం మూటగట్టుకుంది. అదే కోవలోకి వస్తుంది 'బిగ్‌బాస్'. గ్యాంగ్‌లీడర్ దర్శకుడు విజయ బాపినీడు, మెగాస్టార్ కాంబోలో నిర్మితమైన సినిమా కావడంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. కథ, కథనాలు కమర్షియల్ సినిమాకు తగ్గట్టుగానే ఉన్నా.. విడుదల టైమింగ్ సరిగ్గా లేక పరాజయం పాలైంది. ఈ సినిమాలో రోజా, నిర్మలమ్మ కామెడీ ట్రాక్ మరీ నేలబారుగా ఉండటం కూడా చిరు కామెడీ టైమింగ్ మెచ్చే అభిమానులకు మింగుడుపడలేదు.

**తాజాగా** విడుదలైన 'గేమ్‌ఛేంజర్' కూడా రాంగ్ టైమింగ్ అని ఇండస్ట్రీ టాక్. 'జెంటిల్‌మెన్', 'భారతీయుడు', 'ఒకేఒక్కడు' ఆ రోజుల్లో అద్భుతాలు. ఈ సినిమా కూడా అదే టైమ్‌లో వచ్చి ఉంటే.. ఇండస్ట్రీ హిట్‌గా నిలిచేదని చెబుతున్నారు. మొత్తంగా ఈ సినిమా ఇండస్ట్రీలో టైమింగ్ ఓన్లీ కింగ్. తొందరపడితే గ్రహపాటు తప్పదు. ఆలస్యం చేస్తే అసలు కూడా దక్కదు.

# అమ్మే నా స్టార్

ఏదో సినిమా స్టార్‌లా నటించాల్సిన అవసరం తన తల్లికి లేదనీ.. ఆమె ఎప్పుడూ రియల్ స్టారేననీ అంటున్నది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే! 'ద ఫ్యాబులస్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైవ్స్' పేరుతో వచ్చిన టెలివిజన్ సిరీస్‌లో మెరిసింది అనన్య పాండే తల్లి.. వందన పాండే! దాంతో ఆమె ఒక్కసారిగా ఫేమస్ అయిపోయింది. నటిగా బిజీగానూ మారిపోయింది. ఈ క్రమంలో ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. తనకూ, తన తల్లికీ మధ్య ఉన్న అనుబంధం గురించి చెప్పుకొచ్చింది. వాళ్ల అమ్మ ఎంత బిజీగా మారినా.. తమకోసం కచ్చితంగా సమయం కేటాయిస్తుందని చెప్పింది. ''నాకు మార్గదర్శకులు, నా చిత్రాలకు ఉత్తమ విమర్శకురాలు మా అమ్మే! నేను తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ.. మా అమ్మ ఇచ్చే ఇన్‌పుట్స్ కచ్చితంగా ఉంటాయి'' అంటూ, తన సినీ కెరీర్‌లో వాళ్ల అమ్మ కీలక పాత్ర పోషిస్తున్నదని చెప్పుకొచ్చింది. ఇంకా మాట్లాడుతూ.. ''సినీతారల జీవితాలు తెరిచిన పుస్తకాల్లానే ఉంటాయి. వారి గురించి ఏ విషయాలూ దాచడానికి ఉండదు. నేను కూడా అంతే! ఏదైనా దాచడం, అబద్ధం చెప్పి తప్పించుకోవడానికి అవకాశం.. అవసరం కూడా నాకు లేదు. మా అమ్మ ఇప్పుడు చాలా ఫేమస్ అయ్యింది. అయినా.. మా ఇంట్లో ఏమీ మారలేదు. ఆమె ఎంత బిజీగా ఉన్నా.. నాకు కావాల్సిన సహాయం చేస్తుంది. షూటింగ్‌లో ఉన్నాననో.. బిజీ అనో ఎప్పుడూ చెప్పదు!'' అంటూ తల్లి గురించి చెప్పుకొచ్చింది. ఇక వృత్తిపరంగా.. బాలీవుడ్ సీనియర్ నటుడు చుంకీ పాండే కూతురిగా ఇండస్ట్రీలోకి వచ్చిన అనన్య.. పలు విజయవంతమైన సినిమాలతో అలరించింది. తెలుగులోనూ విజయ్ దేవరకొండ సరసన లైగర్‌లో అలరించింది.



# చనిపోయాననే అనుకున్నారు!

'గదర్ 2' చిత్రీకరణ సందర్భంగా.. తన జీవితంలో పీడకల లాంటి ఓ సంఘటన జరిగిందని చెప్పుకొచ్చింది బాలీవుడ్ తార అమీషా పటేల్. లొకేషన్‌లో ఉన్నవాళ్లంతా తాను చనిపోయాననే అనుకున్నారని వాపోయింది. ఆ సమయంలో సన్నీ డియోల్.. నిజమైన హీరో అవతారమెత్తి తనకు సహాయం చేసినట్టు చెప్పింది. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమీషా పటేల్ మాట్లాడుతూ.. 'గదర్ 2' షూటింగ్ సందర్భంగా జరిగిన ఆ సంఘటనను పంచుకున్నది. అమీషాకు మొదట్నుంచీ చలి వాతావరణం పడదు. అయినా.. 'గదర్ 2'లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించడానికి అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉండటంతో.. అమీషా తనకున్న సమస్య గురించి డైరెక్టర్‌తో ముందే చెప్పిందట. తాను చల్లని వాతావరణంలో ఇట్టే జబ్బు పడతాననీ.. వర్షం పడే సీన్‌లో నీళ్లు వేడిగా ఉండేలా చూడాలని కోరిందట. కానీ, షూటింగ్ సందర్భంగా వాళ్లపై కురిపించిన వర్షం నీళ్లు.. గడ్డ కట్టేంత చలిగా ఉన్నాయట. ''దాంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యా! గజగజ వణికిపోతూ స్పృహతప్పి పడిపోయా! అక్కడున్న సిబ్బంది వెంటనే నన్ను నా మేకప్ వ్యాన్‌లోకి తీసుకెళ్లారు. దాదాపు మూడునాలుగు గంటలవరకూ స్పృహలోకి రాలేదు! అదో భయంకరమైన సంఘటన!'' అంటూ అమీషా గుర్తు చేసుకున్నది.



# గీతూ.. గీతూ!

కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా.. ఇప్పుడంతా 'గీతూ' జపమే చేస్తున్నది. 'ఇలాంటి సినిమాను తెరకెక్కించిన ఆ మహిళా దర్శకురాలు ఎవరా?' అని నెట్టింట సెర్చ్ మొదలైంది. ఇంతకూ విషయం ఏమిటంటే.. 'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా పాపులారిటీని సంపాదించుకున్న కన్నడ స్టార్‌హీరో యశ్ తాజా చిత్రం.. 'టాక్సిక్'. ఇటీవలే యశ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన 'టాక్సిక్' గ్లింప్స్.. యూట్యూబ్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నది. విడుదలైన 24 గంటల్లోనే 35.9 మిలియన్ల వ్యూలను సాధించి.. అత్యధిక మంది వీక్షించిన భారతీయ సినిమా 'గ్లింప్స్'గా నిలిచింది. అయితే.. హీరోతోపాటు నెటిజన్లను ఆకట్టుకున్న మరో అంశం.. ఈ చిత్ర దర్శకురాలు గీతూ మోహన్‌దాస్. 'కేజీఎఫ్'లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత హీరో యశ్ ఒక మహిళా దర్శకురాలి సినిమాలో నటించడం.. ఈ సినిమా గ్లింప్స్‌తోనే అందరిలోనూ గూస్‌బంప్స్ తీసుకురావడంతో.. ఆమె ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు.



### ఇంతకూ ఎవరీ గీతూ..

కేరళలోని కన్నూర్ గీతూ మోహన్‌దాస్ సొంతూరు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిందామె. ఐదేళ్ల వయసులో.. తన నాలుగో చిత్రంలోనే మలయాళ స్టార్‌హీరో మోహన్‌లాల్‌తో స్క్రీన్‌ను పంచుకున్నది. ఈ చిత్రంలో ఆమె నటనకు.. ఉత్తమ బాలనటిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర పురస్కారం దక్కించుకున్నది. ఆ తర్వాత హీరోయిన్‌గానూ కొన్ని సినిమాలు చేసింది. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డునూ అందుకున్నది. ఆ తర్వాత.. దర్శకురాలిగా మారి, మెగా ఫోన్ చేతపట్టింది.

### అవార్డులే అవార్డులు..

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వచ్చిన మొదటి చిత్రం.. 'కెల్కున్నుందో'. ఇదో షార్ట్‌ఫిల్మ్! అయినా.. లాంగ్ రన్‌లో ఎన్నో అవార్డులను అందుకున్నది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (రోటర్‌డామ్)లో ప్రదర్శితమైంది. ఉత్తమ షార్ట్ ఫిక్షన్‌గా మూడు అంతర్జాతీయ అవార్డులనూ గెలుచుకుంది. ఈ చిత్ర కథ.. 12వ తరగతి విద్యార్థుల కోసం కేరళ రాష్ట్ర సిలబస్‌లో చోటు సంపాదించుకున్నది. 2013లో 'లయర్స్ డైస్' చిత్రంతో దర్శకురాలిగా మరో మెట్టు ఎక్కింది. నవాజుద్దీన్ సిద్ధిఖీ, గీతాంజలి థాపా నటించిన ఈ సినిమా.. విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నది. రెండు జాతీయ చలనచిత్ర అవార్డులనూ అందుకున్నది. ఉత్తమ విదేశీ భాషా చిత్రం విభాగంలో.. 87వ ఆస్కార్ అవార్డులకు భారత్ నుంచి అధికారిక ప్రవేశం పొందింది. రెండో చిత్రం 'మూథోన్'తో.. తన విజయ పరంపరను కొనసాగించింది గీతూ. ఈ సినిమా సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'గ్లోబల్ ఫిల్మ్ మేకర్ అవార్డు'ను తెచ్చిపెట్టింది. అలా.. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న గీతూ మోహన్‌దాస్ నుంచి వస్తున్న మూడో చిత్రం.. టాక్సిక్. అందుకే, 'టాక్సిక్' చిత్రంపై భారత్‌లోనే కాకుండా, అంతర్జాతీయంగానూ భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సినిమా ఎన్ని అవార్డులు అందుకుంటుందో.. ఎన్ని రికార్డులు బద్దలు కొడుతుందో తెలియాలంటే.. ఈ ఏడాది చివరివరకూ ఆగాల్సిందే!